www.kalamjyothi.com
# కలంజ్యోతి
రేపటి కోసం
సోమవారం 10.03.2025

## విలేఖరులు కావలెను




కలంజ్యోతి తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా స్టాఫర్లు, కంట్రీబ్యూటర్లు కావలెను. తెలుగు భాషపై పూర్తిస్థాయిలో పట్టు.. సమకాలీన రాజకీయాలు, సామాజిక అంశాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి 'కలంజ్యోతి' సాదర స్వాగతం పలుకుతోంది.

సెల్ : 9494 009 003




# మనమే ఛాంపియన్స్

## న్యూజిలాండ్‌పై భారత్ ఘన విజయం

మూడోసారి వరల్డ్ ఛాంపియన్స్‌గా నిలిచిన టీమిండియా

- మ్యాన్ ఆఫ్ ది టోర్నమెంట్ 'రోహిత్ శర్మ'
- మ్యాన్ ఆఫ్ ది సిరీస్ 'రచిన్ రవీంద్ర'

4లో



## 10 వేల మందితో మహా ధర్నా

బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

- మూడు నెలల్లో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ పనులు ప్రారంభించాలి
- ఆయిల్ పామ్ కొనే బాధ్యత ప్రభుత్వానిదే
- రైతుల కంటే ప్రైవేటు కంపెనీ వ్యక్తులే ముఖ్యమా?
- మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డికి మతి భ్రమించింది
- గత పదేళ్లలో మీరు చేసిన అక్రమాలు మరిచారా?
- మీ ఇంటి అక్రమ చిట్టా అందరికీ తెలుసూ
- అధికార పార్టీలో చేరింది అక్రమ ఆస్తులు కాపాడుకోవడానికి కాదా?

2లో



## మానవసేవే మాధవ సేవా

**ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ**

**అలయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బాడీ ఫ్రీజర్ అందజేత**

**కలంజ్యోతి, ఇల్లంతకుంట :** మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో అలయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బాడీ ఫ్రీజర్ (శవ పేటిక) ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుకోని ఘటన ఎవరైనా మరణిస్తే బాడీ ఫ్రీజర్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మానవ సేవే మాధవ సేవా అనే ఆలోచనతో ఇంత చక్కటిని కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన అలయన్స్ క్లబ్ వారికి అభినందనలు తెలిపారు. అనంతరం అలయన్స్ క్లబ్ సభ్యులకు మెంబర్ షిప్ కార్డులను అందజేశారు. కార్యక్రమంలో అలయన్స్ క్లబ్ ఇంటర్ నేషనల్ కమిటీ చైర్మన్ డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, డాక్టర్ కవ్వంపల్లి అనురాధ, అలయన్స్ క్లబ్ ఇల్లంతకుంట అధ్యక్షులు అల్లాడి ఆనంద్ శర్మ, ప్రధాన కార్యదర్శి కూనబోయిన బాలరాజు, పీఆర్ఓ బండారి నర్సయ్య, ఎం.రాజు తదితరులు పాల్గొన్నారు



## విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ

**కలంజ్యోతి, చెన్నారావుపేట :** వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాల పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు లీడ్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కాసుల రవికుమార్ పరీక్ష ప్యాడ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు రానున్న పరీక్షలలో మంచి ఫలితాలు సాధించాలని తాము ఎంచుకున్న రంగాల్లో విజయం సాధించాలని అన్నారు. ఆదర్శ పాఠశాల ఇంగ్లీష్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ తన సంపాదనలో కొంత భాగం గ్రామీణ ప్రాంత విద్యార్థుల విద్య సేవకై కేటాయిస్తూ రవికుమార్ అందరికో స్ఫూర్తిగా నిలుస్తున్నారని స్పెషల్ ఆఫీసర్ జ్యోతి అన్నారు. ప్రభుత్వ పాఠశాలలలో చదువుకునే పేద విద్యార్థులకు పరీక్షల మెటీరియల్ తో పాటు, గ్రంథాలయాలు ఏర్పాటు చేస్తూ తనవంతుగా ఎన్నో సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటున్న రవికుమార్ దారిలో నడుస్తూ ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జాయిన్ హాండ్స్ ఫౌండేషన్ సభ్యులు రంజిత్ కుమార్, సందీప్, రాజు, ఫౌండేషన్ మండలం ఇంచార్జ్ నర్మట యాదగిరి, టీచర్లు సుజాత, షాహిన, సుజాత, ఉమా, రాజ్యలక్ష్మి, యశోద, అనిత, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

# 10 వేల మందితో మహా ధర్నా

**బీజేఎల్పీ నేత**

**ఏలేటి మహేశ్వర్ రెడ్డి**



**కలంజ్యోతి, నిర్మల్ :** మూడు నెలల్లో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ పనుల ప్రారంభించాలని లేనిపక్షంలో 10వేల మంది రైతులతో ధర్నా నిర్వహిస్తానమని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి హెచ్చరించారు. నిర్మల్ లోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి వయసు మీదపడి మతి భ్రమించి మాట్లాడడం సరికాదని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో ఇష్టారీతిన అక్రమాలు, భూ కబ్జాలు, చేసి జిల్లాను అస్తవ్యస్తంగా చేశారని మండి పడ్డారు.

**రైతుల కంటే ప్రైవేటు కంపెనీ వ్యక్తులే ముఖ్యమా?**

రైతుల ప్రయోజనాల కంటే ప్రైవేట్ వ్యక్తుల ప్రయోజనాలే ఆయనకు ముఖ్యమయ్యాయని మండిపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో పామ్ ఆయిల్ కంపెనీకి 40 ఎకరాల ప్రభుత్వ భూమిని సొంత పార్టీకి చెందిన ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టింది వాస్తవం కాదా? అన్నారు. సిద్దిపేటలో ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ కు ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ఇచ్చినపుడు నిర్మల్ లో ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. గతంలో మంత్రిగా పనిచేసిన ఇంద్రకరణ్ రెడ్డి పాక్ పట్ల గ్రామంలోని తన వ్యవసాయ క్షేత్రం సమీపంలో ఓ ప్రైవేట్ కంపెనీకి తక్కువ ధరకు ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ కోసం భూములు ఇప్పించింది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. కేవలం కమిషన్లకు కక్కుర్తి పడి భూములను అప్పనంగా అప్పగించారని విమర్శించారు. ప్రైవేట్ ఫ్యాక్టరీలు ఇచ్చే కమిషన్లతో రైతులతో కలిసి ధర్నా చేస్తానని చెప్పడం సిగ్గుచేటన్నారు. 100 గజాలు పేదలకు ఇల్లు కట్టుకోవడానికి ఇవ్వడానికి చేతకాక పోగా 40 ఎకరాల ప్రభుత్వ భూమిని తక్కువ ధరకే ప్రైవేట్ కంపెనీకి ధారాదత్తం చేయడం హాస్యాస్పదమన్నారు. ఆయిల్ పామ్ ఫ్యాక్టరీపై నిర్వహించిన సంయుక్త తనిఖీ కమిటీ నివేదిక ప్రకారం కేటాయించిన భూమి ఇరిగేషన్ శాఖ పరిధిలోదని, ముంపునకు గురయ్యే ప్రమాదం ఎక్కువగా ఉందనీ ఇరిగేషన్ అధికారులు నివేదికలో పొందుపర్చారన్నారు. ఫ్యాక్టరీ నిర్మాణ అనుమతులు ఒక సర్వే నంబర్ లో చూపి, నిర్మాణం వేరే సర్వే నంబర్ లో చేశారన్నారు. మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ప్రతిదీ రాజకీయం చేయడం సరికాదన్నారు. ఫ్యాక్టరీ నిర్మాణం కోసం సీఎం రేవంత్ రెడ్డి, ఇన్ చార్జ్ మంత్రి సీతక్క దగ్గర ధర్నా చేయాలని హితవు పలికారు.

**అధికార పార్టీలో చేరింది అక్రమ ఆస్తులు కాపాడుకోవడానికి కాదా?**

నియోజకవర్గ ప్రజలు మాజీ మంత్రికి రిటైర్మెంట్ ప్రకటించి గత ఎన్నికల్లో ఓడించారని గుర్తు చేశారు. ఓటమి చెంది నెల రోజులు కాక ముందే అధికార పార్టీలో చేరింది అక్రమ ఆస్తులు కాపాడుకోవడానికి కాదా? అని నిలదీశారు. నీ సొంత తమ్ముళ్లు చేసిన అక్రమాల చిట్టాకు అంతే లేదన్నారు. ఇరిగేషన్ నాళాలు పూడ్చి అనుమతులు లేకుండా లేఔట్లు చేసి అమాయక ప్రజలను మోసం చేస్తున్నారని దుయబట్టారు. రత్నాపూర్ కాండ్లిలో గ్రోఫాస్ట్ పేరిట ఐకే రెడ్డి కుటుంబ సభ్యుడు ఇరిగేషన్ కెనాల్ ను పూర్తిగా ధ్వంసం చేసి, పూడ్చేసి అక్రమ లేఔట్ నిర్మించారన్నారు. మాడేగావ్ లో అక్రమంగా క్రషర్ మిషన్ నడిపించింది ఆయన తమ్ముడే నని ఆరోపించారు. చిట్యాల్ గ్రామంలో ఆయన సోదరుడు మురళీధర్ రెడ్డి ఏర్పాటు చేసిన లేఔట్ కు దారి కోసం అసైన్డ్ భూమిలో ఉన్న నాలాపై అక్రమంగా బ్రిడ్జి నిర్మాణం చేసింది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. ప్రభుత్వ భూమిలో నిర్మించిన డీ మార్ట్ పై కలెక్టర్ తో పాటు ఉన్నత అధికారులకు కంప్లయింట్ చేశామని మార్ట్ నిర్మాణం కోసం సోఫి నగర్ లో ఉన్న ఇండస్ట్రియల్ జోన్ ను మంజులాపూర్ కు తరలించి రైతులను అరిగోస పెట్టింది ఆయనేనన్నారు. అధికార పార్టీలో ఉండి ఈ విచారణను అడ్డుకునే ప్రయత్నం చేస్తే రాబోయే తమ ప్రభుత్వంలో తప్పక చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా బీజేపీ నాయకులు రావుల రాంనాథ్, మెడిసెమ్మ రాజు, పట్టణ అధ్యక్షులు ఆకుల కార్తీక్, సుంకరి సాయి, నాయకులు ముత్యం రెడ్డి, భూపాల్ రెడ్డి, సాదం అరవింద్, భూపతి రెడ్డి, వొడిసేల అర్జున్, మండల పార్టీ అధ్యక్షులు మార గంగారెడ్డి, బర్కుంట నరేందర్, నర్సరెడ్డి, నాయకులు విజయ్, రాజేందర్, దత్తూరాం తో పాటు పలువురు పాల్గొన్నారు.



## రోడ్డు పనులకు శంకుస్థాపన

**కలంజ్యోతి, నిర్మల్ :** నిర్మల్ రూరల్ మండలం చిట్యాల్ నుండి గాంధీనగర్ వరకు రూ.25 కోట్లతో ఆర్ అండ్ బీ రోడ్డు నిర్మాణ పనులకు ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిట్యాల్ గ్రామ ప్రజలు ఎల్లప్పుడూ తనకు అండగా ఉన్నారని, ఈ గ్రామ అభివృద్ధికోసం తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. 2 నెలల్లో ఈ రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం గ్రామంలోని పలు ఆలయాలను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు వెంకట్ రెడ్డి, మార గంగారెడ్డి, జిల్లా బీజేపీ నాయకులు రావుల రాంనాథ్, జమాల్ , భూపాల్ రెడ్డి, ముత్యం రెడ్డి, భూపతి రెడ్డి, అశ్వత్థామ, రాజేశ్వర్, ముత్యం, కార్తీక్, సాయి తదితరులు పాల్గొన్నారు.



# బీసీల గొంతు నులిమేసే కుట్ర

## సీఎం రేవంత్ రెడ్డి

- వారికి దక్కాల్సిన రిజర్వేషన్లు ఇవ్వనీయడం లేదు
- రాష్ట్రంలో కులగణన నిర్వహిస్తే అడ్డుకుంటున్నారు
- బీసీల లెక్కలు తీయడం ఇష్టంలేని వారే వ్యతిరేకిస్తున్నారు
- నన్ను అశీర్వదిస్తే.. మిమ్మల్ని కాపాడుకుంటా
- పద్మశాలి మహాసభలో ముఖ్యమంత్రి

**కలంజ్యోతి, హైదరాబాద్ :** రాష్ట్రంలో బలహీన వర్గాల హక్కులను కాలరాసి వారి గొంతులను నులిమేసే కుట్ర జరుగుతోందని సీఎం రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని మొగ్గలోనే తుంచేందుకు కొందరు కంకణం కట్టుకున్నారని ఆరోపించారు. కులగణనపై తాము అసెంబ్లీలో తీర్మానం చేస్తే అది ప్రధానమంత్రి నరేంద్రమోదీ మెడపై కత్తిలా వేలాడుతుందన్నారు. అందుకే బీఆర్ఎస్, బీజేపీ నేతలు కులగణన లెక్కలను తప్పు అని మాట్లాడుతున్నాయని మండిపడ్డారు. ఆదివారం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో అఖిలభారత పద్మశాలి మహాసభలో పాల్గొన్న సీఎం.. అక్కడ ఏర్పాటు చేసిన చేనేత మగ్గం నేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ 2014 లో అప్పటి సీఎం కేసిఆర్ నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే లెక్కల్లో ఉన్నత కులాలు 21 శాతం ఉంటే.. ఇటీవల తాను నిర్వహించిన కులగణన సర్వేలో ఆయా కులాలు 15.28 శాతం మాత్రమే ఉన్నట్లు తేలిందన్నారు. జనాభా ప్రాతిపదికన న్యాయపరంగా బీసీలకు అందాల్సిన నిధులు, హక్కులు దక్కకుండా బీజేపీ, బీఆర్ఎస్ నేతలు అడ్డుపడుతున్నారని ఆరోపించారు. వారి కుట్రలను బీసీ సమాజం తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఇతర రాష్ట్రాల ఎన్నికలలోనూ ఇక్కడి పద్మశాలీలు కీలకంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. ఆత్మ గౌరవంలోనే కాదు.. త్యాగంలోనూ పద్మశాలీలు ముందుంటారని సీఎం వ్యాఖ్యానించారు. రాష్ట్ర సాధన కోసం తన పదవిని త్యాగం చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీనే ఇందుకు నిదర్శనమన్నారు. తెలంగాణ ఉద్యమం పురుడుపోసుకునేందుకు తన సొంత ఇంటినే వేదిక చేసిన వ్యక్తి కొండా లక్ష్మణ్ బాపూజీ అని కొనియాడారు. అలాంటి వ్యక్తి మరణిస్తే గత ప్రభుత్వం నివాళులు అర్పించలేదన్నారు. ఆ సంఘటనను పద్మశాలి సమాజం మరిచిపోలేదని చెప్పారు. తెలంగాణ ఉద్యమంలో ముందున్న మరో వ్యక్తి టైగర్ ఆలే నరేంద్ర అన్న సీఎం..ఆయన్ను కాంగ్రెస్ పార్టీ కేంద్ర మంత్రిని చేసిందన్నారు. కానీ ధృతరాష్ట్ర కౌగిలితో కెసీఆర్ ఆయన్ను ఖతం చేశారని ఆరోపించారు. ఏ అవకాశం వచ్చినా పద్మశాలి సోదరులకు న్యాయం చేయడమే తమ ప్రభుత్వ విధానమన్నారు. కేంద్రంతో మాట్లాడి ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ ఏర్పాటు చేయడంతో పాటు దానికి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టుకున్నట్లు వివరించారు. ఆసిఫాబాద్ మెడికల్ కాలేజీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెడుతున్నట్లు సీఎం ప్రకటించారు. ఆ బాధ్యతను మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావుకు అప్పగిస్తున్నట్లు చెప్పారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు ఇచ్చే రూ. 600 కోట్ల విలువైన 1.30 కోట్ల చీరల ఆర్డర్ ను నేతన్నలకు ఇచ్చి చేనేతను ఆదుకుంటున్నామన్నారు. చేనేత కార్మికులు అడిగింది ఇవ్వడమే తన కర్తవ్యమన్నారు. నన్ను ఆశీర్వదించిన ఈ సమాజానికి సేవ చేయడమే తప్ప మరో ఆలోచన లేదన్నారు. అభిమానంతో నన్ను గుండెల్లో పెట్టుకుంటే మీ కుటుంబ సభ్యుడిలా మిమ్మల్ని ఆదుకుంటానని హామీ ఇచ్చారు. రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలో కులగణన నిర్వహించి బలహీనవర్గాల లెక్క తేల్చామని చెప్పారు. ఇది ఇష్టం లేని వారు లెక్కలు తప్పని మాట్లాడుతున్నారని విమర్శించారు. రూ. కోటితో.. షోలాపూర్ లో పద్మశాలీ ఆత్మగౌరవాన్ని నిలిపేలా మార్కండేయ భవనం నిర్మించేందుకు సహకరిస్తామని సీఎం హామీ ఇచ్చారు. ఆర్థిక, రాజకీయంగా, ఉపాధి, ఉద్యోగ పరంగా ప్రభుత్వం చేనేతకుల అండగా ఉంటుందన్నారు. ఈ సభలో మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, మినరల్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, అఖిలభారత పద్మశాలి సంఘం నేతలు పాల్గొన్నారు.





## సీఎంని కలిసిన అడువాల జ్యోతి

**కలంజ్యోతి, జగిత్యాల :** హైదరాబాద్ 'చలో పద్మశాలి-చలో హైదరాబాద్'17 వ అఖిల భారత పద్మశాలి మహాసభల కార్యక్రమంలో భాగంగా నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ లో అఖిల భారత పద్మశాలి మహాసభకు ముఖ్యఅతిథిగా సీఎం రేవంత్ రెడ్డి విచ్చేసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు , టీజీఎండీసీ చైర్మన్ ఈరవత్రి అనిల్ లను జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ మర్యదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు.

## బల్వంతాపూర్ శివారులోని చెరువులో మట్టి త్రవ్వకాలు?



**కలంజ్యోతి, మల్యాల :** మల్యాల మండలం బల్వంతాపూర్ గ్రామ శివారులోని రేగుల కుంట చెరువులో ఆదివారం తెల్లారుజామున అక్రమంగా కొందరు మట్టి త్రవ్వకాలు చేపట్టినట్లు తెలిసింది. ఎలాంటి అనుమతి లేకుండా చెరువులో జేసీబీ ఏర్పాటు చేసుకొని పదుల సంఖ్యలో టిప్పర్లతో జగిత్యాల వైపు మట్టి తరలించినట్లు పలువురు స్థానికులు ఆరోపించారు. గత వారం క్రితం కూడా తెల్లవారు జామునే మట్టి త్రవ్వకాలు చేపట్టినట్లు వారు చెబుతున్నారు. అయితే ఆదివారం కూడా వరుసగా మట్టి తరలిస్తుండడంతో సమాచారం అందుకున్న పోలీసులు చెరువు వద్దకు చేరుకున్నారు. అంతలోపే జేసీబీ, టిప్పర్లతో వారు పరారైనట్లు పోలీస్ సిబ్బంది మధుసూదన్ రెడ్డి తెలిపారు. అయితే పోలీసులు వస్తున్నట్లు వారికి ముందే సమాచారం ఎలా అందిందంటూ పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు, సంబధిత అధికారులు నిఘా పెట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.



## డీయూ నుంచి మల్లారెడ్డికి డాక్టరేట్

### సన్మానించిన రెడ్డి సంఘం నాయకులు

**కలంజ్యోతి. భీమదేవరపల్లి :** మండలంలోని ముత్తారం గ్రామరెడ్డి సంఘం ఆధ్వర్యంలో ముస్తఫాపూర్ గ్రామానికి చెందిన, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, తెలంగాణ ఉద్యమ నాయకులు ఏనుగు మల్లారెడ్డికి ఘన సత్కారం చేశారు. మల్లారెడ్డి ఇటీవల సామాజిక సేవలో విశిష్ట సేవలు అందించినందుకు గానూ ఢిల్లీ కేం బ్రిడ్జి డిజిటల్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ పట్టా అందుకున్నారు. మల్లారెడ్డి తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొని తెలంగాణ విద్యావంతుల వేదిక, జేఏసీ నిర్మాణంలో పాలుపంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏనుగు ఎల్లారెడ్డి, ముత్యం రెడ్డి, ధర్మారెడ్డి, శంకర్ రెడ్డి, విజయ్ ప్రసాద్ రెడ్డి, వెంకట సురేందర్ రెడ్డి, రామ్ రెడ్డి, సురేందర్ రెడ్డి, కరెంటు చొక్కారెడ్డి, రామకృష్ణారెడ్డి, రాంపూర్ చొక్కారెడ్డి, ఊరడి జయపాల్ రెడ్డి, యుగంధర్ రెడ్డి, మహేందర్ రెడ్డి, కాశిరెడ్డి రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.







# మనమే ఛాంపియన్స్

**దుబాయ్:**
ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ-2025ను భారత్ సొంతం చేసుకుంది. లీగ్ దశలో మూడు మ్యాచ్‌లతో పాటు సెమీఫైనల్, ఫైనల్ కలిపి ఆడిన ఐదు మ్యాచ్‌లలో ఓటమి లేకుండా జట్టు టైటిల్ గెలుచుకుంది. దుబాయ్‌లో ఆదివారం జరిగిన ఫైనల్లో భారత్ 4 వికెట్ల తేడాతో మాజీ ఛాంపియన్ న్యూజిలాండ్‌పై విజయం సాధించింది. గతంలో భారత్ 2002, 2013లలో కూడా చాంపియన్స్ ట్రోఫీ టైటిల్‌ను గెల్చుకుంది.

ఫైనల్లో టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన కివీస్ 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 251 పరుగులు చేసింది. డరైల్ మిచెల్ (101 బంతుల్లో 63; 3 ఫోర్లు), మైకేల్ బ్రేస్‌వెల్ (40 బంతుల్లో 53 నాటౌట్; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు చేశారు. అనంతరం భారత్ 49 ఓవర్లలో 6 వికెట్లకు 254 పరుగులు సాధించి గెలిచింది.

'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రోహిత్ శర్మ (83 బంతుల్లో 76; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు) చెలరేగగా... శ్రేయస్ అయ్యర్ (62 బంతుల్లో 48; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. టోర్నీ మొత్తంలో 263 పరుగులు చేసి 3 వికెట్లు తీసిన న్యూజిలాండ్ ప్లేయర్ రచిన్ రవీంద్ర 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ' అవార్డు గెల్చుకున్నాడు.

**స్కోరు వివరాలు**

**న్యూజిలాండ్ ఇన్నింగ్స్:**
యంగ్ (ఎల్బీ) (బి) వరుణ్ 15; రచిన్ (బి) కుల్దీప్ 37; విలియమ్సన్ (సి అండ్ బి) కుల్దీప్ 11; మిచెల్ (సి) రోహిత్ (బి) షమీ 63; లాథమ్ (ఎల్బీ) (బి) జడేజా 14; ఫిలిప్స్ (బి) వరుణ్ 34; బ్రేస్‌వెల్ (నాటౌట్) 53; సాంట్నర్ (రనౌట్) 8; స్మిత్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 16; మొత్తం (50 ఓవర్లలో 7 వికెట్లకు) 251. వికెట్ల పతనం: 1-57, 2-69, 3-75, 4-108, 5-165, 6-211, 7-239. బౌలింగ్: షమీ 9-0-74-1, పాండ్యా 3-0-30-0, వరుణ్ చక్రవర్తి 10-0-45-2, కుల్దీప్ యాదవ్ 10-0-40-2, అక్షర్ పటేల్ 8-0-29-0, రవీంద్ర జడేజా 10-0-30-1.

**భారత్ ఇన్నింగ్స్:**
రోహిత్ (స్టంప్డ్) లాథమ్ (బి) రచిన్ 76; శుబ్‌మన్ గిల్ (సి) ఫిలిప్స్ (బి) సాంట్నర్ 31; కోహ్లి (ఎల్బీ) (బి) బ్రేస్‌వెల్ 1; శ్రేయస్ అయ్యర్ (సి) రచిన్ (బి) సాంట్నర్ 48; అక్షర్ పటేల్ (సి) రూర్కే (బి) బ్రేస్‌వెల్ 29; కేఎల్ రాహుల్ (నాటౌట్) 34; హార్దిక్ పాండ్యా (సి అండ్ బి) జేమీసన్ 18; జడేజా (నాటౌట్) 9; ఎక్స్‌ట్రాలు 8; మొత్తం (49 ఓవర్లలో 6 వికెట్లకు) 254. వికెట్ల పతనం: 1-105, 2-106, 3-122, 4-183, 5-203, 6-241. బౌలింగ్: జేమీసన్ 5-0-24-1, రూర్కే 7-0-56-0, స్మిత్ 2-0-22-0, సాంట్నర్ 10-0-46-2, రచిన్ 10-1-47-1, బ్రేస్‌వెల్ 10-1-28-2, ఫిలిప్స్ 5-0-31-0.



## మెదక్ జిల్లాలో భారీ సంఖ్యలో

# నాటు కోళ్లు మృతి

- అంతుచిక్కని వ్యాధితో మొన్నటి వరకు బాయిలర్ కోళ్లు
- నేడు వేల సంఖ్యలో నాటు కోళ్లు మృతి
- నర్సాపూర్ (మం) లింగాపూర్ లో నాటు కోళ్లను పెంచుతున్న రైతు
- మృత్యువాత పడిన 3500 నాటుకోళ్లు.



**కలంజ్యోతి, నర్సాపూర్ :** సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో బర్డ్ ఫ్లూ టెన్షన్ మొదలైంది. కోళ్ల ఫారాల్లో వేల సంఖ్యలో కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. లక్షల్లో పెట్టుబడిన పౌల్ట్రీల నిర్వాహకులు వాటిని పూడ్చిపెడుతున్నారు. తమను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. అంతుచిక్కని వ్యాధితో కోళ్లు చనిపోతున్నాయని పెంపకందారులు చెబుతున్నారు. కేవలం శాంపిల్స్ సేకరించడంతోనే సరిపెడుతూ.. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పుల్కల్, చౌటు కూరు మండలాల్లో కేవలం 3 రోజుల వ్యవధిలో 20 వేల కోళ్లు చనిపోయాయి. వరుసగా కోళ్లు మృత్యువాత పడుతుండడంతో జిల్లాలోని కోళ్ల ఫారాలు మూతపడుతున్నాయి. తాజాగా.. మెదక్ జిల్లాలో భారీగా కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. అంతుచిక్కని వ్యాధితో మొన్నటి వరకు బాయిలర్ కోళ్లు, నేడు వేల సంఖ్యలో నాటు కోళ్లు మృతి చెందాయి. నర్సాపూర్ (మం) లింగాపూర్ గ్రామంలో 6 వేల నాటు కోళ్లను ప్రసాద్ అనే రైతు పెంచుతున్నాడు. ఉదయం నుంచి కోళ్ల ఫారంలో అంతుచిక్కని వ్యాధితో 3500 నాటుకోళ్లు మృత్యువాత పడ్డాయి. ఇప్పటివరకు రూ.8 లక్షలు పెట్టుబడి పెట్టి నష్టపోయానని ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. పక్కనే బాయిలర్ కోళ్ల ఫామ్ ఉండడంతో వాటికి వచ్చిన రోగమే నాటుకోళ్లకి సోకిందని అనుమానం వ్యక్తం చేస్తున్నాడు. ఇప్పటి వరకు సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో లక్షల సంఖ్యలో బాయిలర్ కోళ్లు మృత్యువాత పడ్డాయి. కాగా.. చనిపోయిన నాటుకోళ్ల శాంపిల్స్ సేకరించి అధికారులు ల్యాబ్ కి పంపారు.

# సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన

### నిధులు విడుదల చేయించిన కొలన్ హన్మంత్ రెడ్డి

**కలంజ్యోతి, కుత్బుల్లాపూర్ :** నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సాయి కృష్ణజకాలనీలో సీసీరోడ్డు లేకపోవడంతో కాలనీ వాసులు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు.. వారి సమస్యపై స్పందించి నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఫండ్స్ ద్వారా సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.25లక్షలు మంజూరు చేయించారు. ఆదివారం రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ క్రమంలో కాలనీ వాసులు మౌలిక సదుపాయాల సమస్యలు పరిష్కరించాలని కోరారు. సానుకూలంగా స్పందించారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని ప్రజలందరికీ ప్రతిరోజు అందుబాటులో ఉంటానని తెలిపారు. అనంతరం కాలనీ వాసులు శాలువాతో సత్కరించి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, నాయకులు కె జనార్దన్ రెడ్డి, సిద్దనోళ్ల సంజీవ రెడ్డి, వెంకటేశ్వర్ రావు, జీవన్ రెడ్డి, జైసింహ రెడ్డి, నాగేశ్వర్ రావు, విజయ్ తదితర కాలనీ వాసులు పాల్గొన్నారు.




## రక్తదానం




**కలంజ్యోతి, మల్యాల :** గొల్లపెల్లి మండలం రాఘవపట్నం గ్రామానికి చెందిన జెట్టి గంగయ్య గుండె ఆపరేషన్ కోసం కరీంనగర్ లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరగా, బీ పాజిటివ్ రక్తం అవసరం పడింది. దాంతో మల్యాల మండల చిరంజీవి అభిమాన సంఘం అధ్యక్షుడు దూడం రామాంజనేయులుని బాధితుడి కుటుంబ సభ్యులు సంప్రదించడంతో ముత్యంపేటకి చెందిన మునిగంటి గంగాధర్ సమాచారం ఇచ్చాడు. వెంటనే గంగాధర్ స్పందించి రక్తదానం చేసి ఆదుకున్నాడు.



## వధూవరులకు ఆశీర్వాదం

**కలంజ్యోతి, నర్సాపూర్ :** నర్సాపూర్ పట్టణంలోని ఆనంద్ గార్డెన్, రైలాపూర్ నర్సింగరావు ఫంక్షన్ హాల్ లో జరిగిన వివాహ వేడుకల్లో నర్సాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ అశోక్ గౌడ్ పాల్గొని వధూవరులను ఆశీర్వాదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన దంపతులు నిండు నూరేళ్లు చల్లగా ఆయురారోగ్యాలతో పిల్లాపాపలతో వర్ధిల్లాలని ఆకాక్షించారు.

## పరామర్శ




**కలంజ్యోతి, జగిత్యాల :** పట్టణంలోని 36వ వార్డుకు చెందిన భోగ రామకృష్ణ ఇటీవల అనారోగ్యంతో హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఉండగా ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై జగిత్యాల మాజీ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ తెలుసుకున్నారు.



## తక్కళ్లపల్లిలో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు వివాదాస్పదం

**కలంజ్యోతి, మల్యాల :** మల్యాల మండలం తక్కళ్లపల్లి గ్రామంలో శనివారం రాత్రి అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు చేపట్టిన పనులను స్థానికులు అడ్డుకున్నారు. గ్రామంలోని ప్రధాన రహదారి మధ్యలో విగ్రహం ఏర్పాటుకు దళిత నాయకులు పూనుకోగా, అక్కడి స్థానికులు కొందరు అడ్డుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే పోలీసులు చేరుకొని విచారించగా, విగ్రహం ఏర్పాటుతో రహదారి చిన్నగా ఏర్పడి అసౌకర్యంగా మారనుందని స్థానికులు పేర్కొన్నారు. అయితే తాత్కాలికంగా పనులు నిలిపివేయాలని సూచించి, పోలీసులు గొడవ సద్దుమణిగించారు. అయితే ఆదివారం కూడా ఇరువర్గాల మధ్య వివాదం తలెత్తినట్లు తెలిసింది.

6
కళంజ్యోతి
సోమవారం 10.03.2025 General News



# ఎమ్మెల్సీ అభ్యర్థులను ఖరారు చేసిన కాంగ్రెస్

- ఏఐసీసీతో ముగిసిన సమావేశం
- ఎమ్మెల్సీ అభ్యర్థుల పేర్లు ఖరారు
- విజయశాంతికి అవకాశం

**కలంజ్యోతి, హైదరాబాద్ :** ఎమ్మెల్యే కోట ఎమ్మెల్సీ అభ్యర్థుల పేర్లను ఏఐసీసీ ఖరారు చేసింది. అద్దంకి దయాకర్, శంకర్ నాయక్, సినీ నటి విజయశాంతి పేర్లను ప్రకటించింది. కాగా.. సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లిన విషయం తెలిసిందే. ఈ నెల 10న ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థుల నామినేషన్లకు చివరి తేదీ కావడంతో ఆయన మరోసారి ఢిల్లీకి వెళ్లారు. సీఎంతో పాటు ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హస్తినలో.. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లి కార్జున ఖర్గేతో భేటీ అయ్యారు. ఎమ్మెల్సీ అభ్యర్థు ఎంపికపై ఇప్పటికే పార్టీలో పలువురు సీనియర్ నేతలతో సమావేశమైన మీనాక్షి నటరాజన్, మహేశ్ కుమార్.. ఏఐసీసీకి పేర్లను అందించారు. ఈ మేరకు అధిష్టానం అద్దంకి దయాకర్, శంకర్ నాయక్, సినీ నటి విజయశాంతి పేర్లు ఫైనల్ చేసింది. అద్దంకి దయాకర్ .. సీఎం కోటా, శంకర్ నాయక్ పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, జానారెడ్డి కోటా.. విజయశాంతిని అధిష్టానం కోటా కింద ఖరారు చేశారు. కాగా.. రాష్ట్రంలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ల దాఖలు గడువు సోమవారం(మార్చి 10)తో ముగియనుంది. ఇప్పటివరకు అధికార పార్టీల అభ్యర్థుల పేర్లు చివరి క్షణంలో విడుదల చేసింది. తాజా రాజకీయ పరిణామాలు, ఎమ్మెల్యేల సంఖ్యా బలాన్ని పరిశీలిస్తే ఈ ఎన్నికల్లో నాలుగు సీట్లను అధికార కాంగ్రెస్, ఒక స్థానం ప్రతిపక్ష బీఆర్ఎస్ దక్కించుకునే అవకాశం ఉంది.

## మహిళ మృతదేహం లభ్యం

**కలంజ్యోతి, మల్యాల :** ఓ మహిళ మృతదేహం ఎస్సారెస్పీలో లభ్యమైంది. ఎస్ఐ నరేష్ కుమార్ కథనం మేరకు.. మల్యాల మండలం ఓబులాపూర్ గ్రామానికి చెందిన జేసెట్టి వెంకవ్వ (50) ఈ నెల 6 న రాత్రి 11 గంటల నుంచి కనిపించకుండా పోయిందని భర్త గంగన్న ఫిర్యాదు చేశాడు. వెంటనే కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు ప్రారంభించిన క్రమంలో ఆదివారం జగిత్యాల మండలం అంతర్గం గ్రామ శివారులోని ఎస్సారెస్పీలో వెంకవ్వ మృతదేహం లభించింది. ఈ మేరకు పంచనామా నిర్వహించి, పోస్ట్ మార్టం నిమిత్తం మృతదేహాన్ని జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

## టన్నెల్‌లో మృతదేహం గుర్తింపు!

### రెస్క్యూ ఆపరేషన్‌లో కీలక పరిణామం

**కలంజ్యోతి, నాగర్ కర్నూల్ :** ఎస్ఎల్‌బీసీ టన్నెల్ లో గల్లంతైన కార్మికుల జాడ కోసం 16వ రోజు రెస్క్యూ ఆపరేషన్ నిర్విరామంగా కొనసాగుతున్నది. జీపీఆర్, కేరళ నుంచి వచ్చిన కేడవర్ డాగ్స్ గుర్తించిన ప్రదేశాల్లో కూలీల ఆచూకీ కోసం తవ్వకాలు ముమ్మరం చేశారు. ఈ క్రమంలోనే కీలక పరిణామం జరిగింది. టీబీఎంకు ఎడమ వైపు ఓ మృతదేహానికి సంబంధించి కుడి చేయి, ఎడమ కాలును రెస్క్యూ టీమ్ గుర్తించింది. అయితే, ఆ డెడ్‌బాడీ పూర్తిగా టీబీఎంలోని కాంక్రీట్‌లో కూరుకుపోయింది. చేతికి ఉన్న కడియాన్ని బట్టి ఆ బాడీ ఇంజినీర్ గురుప్రీత్ సింగ్‌గా అధికారులు నిర్ధారించారు. సాయంత్రం వరకు మృతదేహాన్ని వెలికితీసే అవకాశం ఉంది. ప్రస్తుతం టీబీఎంలో ఇరుక్కుపోయిన డెడ్‌బాడీని కట్టర్ల ద్వారా కట్ చేసి.. గురుప్రీత్ సింగ్ మృతదేహాన్ని డ్రిల్లింగ్ ద్వారా బయటకు తీసేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. నేటి రెస్క్యూ ఆపరేషన్‌లో సుమారు 130 మంది ప్రత్యక్షంగా పాల్గొంటుండగా అధికారులు దగ్గరుండి పరిస్థితిని సమీక్షిస్తున్నారు.


# అన్నమయ్య సంకీర్తనా మహతి గరిమెళ్ల ఇకలేరు

## తిరుపతిలో కన్ను మూసిన గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్

**కలంజ్యోతి, నిర్మల్ :** ఆయన గళం ఒక గండు తుమ్మెద ఝుంకారం.. ఆయన గాత్రం పారే సెలయేరు.. ఆయన సంకీర్తనా గానం భక్తిరస భరితం. వింటే చాలు ఒళ్ళు మరచి భక్తి భావం పెంపొందుతుంది. ఆయనే తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్థాన విద్వాంసులు, ప్రముఖ వాగ్గేయకారుడు తాళ్ళపాక అన్నమయ్య సంకీర్తనలను ప్రతి ఇంటికి చేర్చిన గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్. ప్రస్తుతం తిరుపతిలో నివాసం ఉంటున్న బాలకృష్ణ ప్రసాద్ రాజమండ్రి లో 1948 నవంబర్ 9న గరిమెళ్ళ నరసింహారావు, కృష్ణవేణి దంపతులకు జన్మించారు. బాల్యం నుంచే విద్యాభ్యాసంతో పాటు వాగ్గేయ కారులైన తన తండ్రి, గాయని, వయొలిన్ కళాకారిణి అయిన తల్లి ద్వారా సంగీతంలో ఓనమాలు నేర్చుకున్నారు. విద్యాభ్యాసం అనంతరం హైదరాబాద్ లో వీరి కుటుంబం స్థిరపడింది.

**సంగీత ప్రస్థానం..**

హైదరాబాద్ లో 1976 లో ఉద్యోగం చేస్తున్న సమయంలో ప్రముఖ విద్వాంసులు నేదునూరి కృష్ణమూర్తి సారథ్యంలో భక్తి రంజని లో భక్తి గీతాలాపనకు బాలకృష్ణ ప్రసాద్ కు పిలుపు వచ్చింది. అప్పటి వరకు నేదునూరి కృష్ణమూర్తి పేరు వినటమే తప్ప ప్రత్యక్షంగా చూడక పోవటం తో వెంటనే అంగీకరించి అక్కడికి వెళ్లారు. ఆ సమయంలో తిరుమల తిరుపతి దేవస్థానం వారు అన్నమాచార్య గీతాలాపన లో శిక్షణ ఇచ్చేందుకు ప్రకటన ఇచ్చారు. ఇదే విషయాన్ని కృష్ణమూర్తి నోట విన్న బాలకృష్ణ ప్రసాద్ తాను చేరతానని తెలిపారు. అయితే ఉద్యోగాన్ని వదలి అక్కడికి వెళ్ళే నిర్ణయాన్ని ఆయన అంగీకరించలేదు. చివరికి బాలకృష్ణ ప్రసాద్ పట్టు మేరకు చేర్పించారు. ఆయన



శిక్షణా సమయంలో నేదునూరి కృష్ణ మూర్తి, పశుపతి, మంగళం పల్లి బాల మురళీ కృష్ణ వంటి సంగీత స్రష్టల ద్వారా సంగీతాన్ని నేర్చుకున్నారు. అనంతరం 25 డిసెంబర్, 1978 లో తిరుమల తిరుపతి దేవస్థానం కళాకారునిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. అదే తరుణంలో అప్పటి దేవస్థానం ఈ ఓ పి వి ఆర్ కే ప్రసాద్ అన్నమాచార్య ప్రాజెక్టు కు శ్రీకారం చుట్టారు. 1979 నుంచి 2006 వరకు ప్రాజెక్టు లో కొనసాగారు. తన శ్రీమతి రాధతో కూడా కలిసి అన్నమాచార్య కీర్తనలు ఆలపించారు.

**రచనా వ్యాసంగంలోకి...**

ఊపిరి సలపని పనుల ఒత్తిడి ఉన్నా వృత్తి ధర్మాన్ని కొనసాగిస్తూనే టిటిడి సహకారంతో పలు సంగీత సంబంధ పుస్తకాలు రచించారు. 1993 లో అన్నమాచార్య సంకీర్తన స్వర సంపుటి, 1997 లో అన్నమాచార్య సంకీర్తనా మంజరి ని తమిళంలో, 1999 లో అన్నమయ్య నృసింహ సంకీర్తనలు, 2000 లో అన్నమాచార్య సంకీర్తనా సౌరభం, 2001 లో అన్నమాచార్య సంకీర్తనా రత్నావళి తెలుగు, తమిళ భాషలలొ రచించారు. 2003 లో అన్నమాచార్య సంకీర్తనా ప్రాథమిక, 2004 లో అన్నమాచార్య సంకీర్తనా మహతి పుస్తకాలతో సంకీర్తనల నొటేషన్ ను అందించారు. దాదాపు 400 కు పైగా కీర్తనలు రచించారు. దాదాపు వెయ్యికి పైగా కీర్తనలను 200 రాగాలలో రూపొందించారు.



**ప్రసార మాధ్యమాల్లో...**

ప్రసార మాధ్యమాల్లో కూడా తన సేవలను కొనసాగించారు. 2008 నుండి దాదాపు రెండున్నరేళ్ల పాటు హరి సంకీర్తనం కార్యక్రమాన్ని కొనసాగించారు. శ్రీవేంకటేశ్వర భక్తి ఛానల్ ద్వారా అన్నమయ్య స్వరార్చన పేరిట 108 ఎపిసోడ్ లు నిర్వహించారు. కృతికర్త గా సుందర రంజని పేరుతో ఆంజనేయస్వామి పై 50 కృతులు, వినాయకునిపై 60 కృతులు రచించారు. సంగీత విద్వాంసునిగా సుందర రంజని, హరి ప్రియ, సంజీవి, నాట హిందోళం, సత్య ప్రియ, శ్యామ కాంభోజి, కోమలి, కరుణశ్రీ, చిత్ర కళ్యాణి, ప్రతిమాభేరి, ప్రతి సావేరి, ప్రసూన, నిషాధి, లలిత మాళవ గౌళ, సుమశ్రీ, సింధు ప్రియ, సుమగంధి సుకామ వర్ధిని, సునంద నంది వంటి నూతన రాగాలను ఆవిష్కరించి సంగీత ప్రపంచానికి అందించారు.

### పురస్కారాలెన్నో...

ఆయన సేవలకు గుర్తింపుగా ప్రభుత్వాలు, పలు సంస్థలు ఆయనకు బిరుద ప్రదానాలు చేశాయి. 2012 నుండి మూడేళ్ళ పాటు తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్థాన విద్వాంసునిగా కొనసాగారు. 7 ఆగస్టు, 2023 న ఇదే పదవిలో నియమితులయ్యారు. కంచి కామకోటి పీఠం, అహోబిల మఠం లో ఆస్థాన విద్వాంసునిగా నియమించి ఆయన సేవలకు గుర్తింపునిచ్చారు. 1997 లో ఉత్తర అమెరికా అన్నమాచార్య ప్రాజెక్ట్ ద్వారా శ్రీ అన్నమాచార్య విద్వన్మణి పురస్కారం అందజేశారు. పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం వారు 2009 లో ఉత్తమ సంగీత విద్వాంసునిగా సన్మానించారు. గరిమెళ్ళ పై తిరుపతి కి చెందిన పి వెంకటలక్ష్మి పత్రాన్ని సమర్పించి పీహెచ్ డీ పొందారు.

Cinema కలంజ్యోతి

సోమవారం 10.03.2025

# లవ్ యూ ఆల్



టాలీవుడ్ హీరోయిన్ అంజలి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అక్కర్లేదు. ఈ నటి తమిళంలో జీవా సినిమాతోనే సినీ ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చింది. ఇదే మూవీ తెలుగులో డేర్ అనే పేరుతో వచ్చింది. 'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు' సినిమాలో సీతగా అవకాశం దక్కించుకుని.. ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. ఈ నటి తాజాగా సోషల్ మీడియాలో ఓ పోస్ట్ పెట్టింది. ఈమె నటించిన 'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు' థియేటర్లలో మళ్లీ విడుదలైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా నటి అంజలి తన ఇన్ స్టాగ్రామ్ వేదికన ఓ పోస్ట్ పెట్టింది. 'సీతమ్మ వాకిట్లోసిరిమల్లె చెట్టు సినిమాను మరోసారి జరుపుకున్నందుకు మీ అందరికీ ధన్యవాదాలు. ఈ పునః విడుదల అన్నింటికంటే గొప్పగా అనిపించింది. లవ్ యూ అందరికీ' అంటూ అంజలి రాసుకొచ్చింది.

